


శ్రీనివాసరావు క్యాంపునుంచి తిరిగి వచ్చి ఆయాసంగా కుర్చీలో కూర్చున్నాడు। తనతో తిరిగి వచ్చిన హోల్డాలు, చేతిసంచీ, గొడుగూ ఎదురుగా కనిపిస్తున్నాయి. కుప్పగా ఒకదాని మీదొకటి గిరవాటు పెట్టి వెళ్ళిపోయాడు కూలివాడు బేదయిస్తే తక్కువని నసిగాడు వాడు. ఎక్కువివ్వటానికి అభ్యంతరంలేదు. కాని తనదగ్గర అంతకు మించి...చిల్లర లేకపోయింది.

"ఏంవండీ, చడీచప్పుడూ లేకుండా వచ్చి కూర్చున్నారే। ఇందాకటినించీ మీ కోసమే చూస్తున్నా...ఇవాళ బస్సు లేటయిందేవిటీ?" అంటూ శ్రీమతి ప్రవేశించింది..."ఇదుగో, ఇంట్లో బియ్యం నిండుకున్నాయి; ఆదివారం కాబట్టి పర్వాలేదు ఆలస్యమైనా...మీరు కాస్త బజారు వెళ్ళొస్తే అంతలో స్నానానికి వేన్నీళ్ళుకూడా రెడీ అవుతాయి."

డబ్బూ, సంచీ తీసుకురా" అన్నాడు శ్రీనివాసరావు

"డబ్బు। అదేదో మీదగ్గరే వుండాలి।...అదుగో సంచీ, మీరు క్యాంపుకు తీసుకెళ్ళినదాన్నే కాళీ పట్టు కెళ్ళండి...ఆ రెండోది కాస్తా ఎలకలు కొరికేశాయి."

"నా దగ్గర డబ్బులేదే...ఎట్టాగ మరి?"

"ఎట్లాగ అని కూచుంటే ఎలాగండీ? విచిత్రంగా వుంది... క్యాంపునుంచి వస్తున్నారుగదా తెస్తారనుకొన్నాను."

ఎదురుగా వున్న హోల్డాలూ, సంచీ,

గొడుగూ వైపు నిశ్చలంగా దృష్టి నిలిపి శ్రీనివాసరావు చిన్నవవ్వు నవ్వాడు...

"మంచిదానివే !...ప్రక్కవాటాలో వాళ్ళని బదులడుగు."

"వాళ్ళకిప్పటికే రెండు శేర్లుదాకా యివ్వాలి మనం...ఇహ డబ్బా ? డబ్బు ఆవిడదగ్గ రెక్కడుంటుంది, పాపం... మీరే వెళ్లి ప్రయత్నించండి."

శ్రీనివాసరావు కదల్లేదు ; దుమ్ము నిండిన సామానువైపు పరిశీలనగా చూస్తూ, పరధ్యానంగా కూర్చున్నాడు.

కొన్ని క్షణాలు నిదానించిన శ్రీమతి—"ఎవరైనా స్నేహితుల్ని దగండీ ! .. అలా కూచుంటారేమిటి ? ఏమీ పట్టనట్టు! పెద్ద వేదాంతిలా... పలక్కుండా, జవాబు లేకుండా కూర్చోటం అలవాటు చేస్తున్నారేమిటీ నన్నేదో సాధిస్తున్నట్లు ! వేగిరం కద లండి మరి...లేకపోతే యీ పూట పస్తే !" అన్నది.

శ్రీనివాసరావు లేచి నుంచున్నాడు. "...అది కాదు... రాధా, ఒక్కపూట అన్నం లేకపోతే ప్రపంచం తలక్రింద వుతుందంటావా ?"

"ఏం మాటలండీ , బాగుంది... పెళ్లాం పిల్లలు పస్తుంటారంటే మీకేం చీమకుట్టినట్లు కూడా లేదన్నమాట !... అయినా, వెళ్ళి జరిగే పనేమిటో చూడ కుండా, ప్రపంచాన్ని గురించి వైరాగ్యాలు మాట్లాడుతూ కూచుంటా రేమిటంట ?"

"నువ్వు అరవబోక...ఇదుగో... ఏం లేదులే !...వెళ్తున్నా ! అంటే, నేననేది మరేమీ విపరీతం కాదు ; ఈ పూట అన్నం మానేసి రాత్రికి వండు కుంటే యింతలో జరిగే ప్రమాదం ఏమిటి అని అనుమానం !"

"ఏం ప్రశ్నలండీ !...అసలు పస్తుం డాల్సిన కర్మమేంకాలింది ? అంత దరిద్రం మనకేమొచ్చింది ?...ఇబ్బం దులు ఎవరికైనా వస్తాయి...కానీ, ఎట్లాంటి యిబ్బందులు వచ్చినా పస్తు పడకునేంత దరిద్రం మనకెన్నడూ రాదు...ఎట్లాంటివాళ్లు పస్తుపడుకునేది ! ఊరికే కబుర్లు చెప్పక వెళ్లిరండి... పుణ్యముంటుంది "

శ్రీనివాసరావు బయలుదేరాడు గొడుగూ, సంచీ పుచ్చుకొని...రాధతో వాదించి ప్రయోజనంలేదు...అసలు ఎవరు మాత్రం యీ విషయంలో తనతో ఏకీభవిస్తారు.. నిజంగానే, ఒక్కపూట పస్తుంటే ఏం పుట్టిమునుగ తుందో! బాగా ఆకలివేసి రెండోపూట అన్నం రుచి స్తుంది. అంతేగాక!...కాని, ఒకపూట పస్తుండిపోతే...ఏదో అవమానం. ఎంతోమేర సాంఘికంగా దిగజారి నట్లు... అయ్యో! తినటానికి లేక పస్తున్నాం!!' ఆ మాటలో ఏదో పెద్ద

దిగులు! "పిల్లలు కడుపులు మెన్నం టుకు పోయి అలమటిస్తుంటే కళ్ళతో చూశాం...తల్లి, దండ్రీ యిద్దరమూ బ్రతికివుండీను!" అని ఏడుపు, తిట్టు కోటం, ఏదో మహాఘోరం జరిగిపోయి నట్లే బాధపడడం...ఇక తర్వాత, తర్వాత— "ఫలానారోజు, బియ్యం లేక, అవి తెచ్చుకోటానికి చిల్లిగవ్వలేక, పస్తుపడివున్నాం"...అంటూ జీవిత చరిత్రలో ప్రధానఘట్టం కింద చిత్రించు కోవటం.. ఈ గోలంతా ఒక్కపూట తిండిని గురించే!! కో ఆపరేటివ్ జూని యర్ ఇన్‌స్పెక్టర్ చేస్తున్న మానవుడి జీవితంలో యిలాంటివే మైలురాళ్ళు!

శ్రీనివాసరావు హెడ్‌క్లార్కు రామ నాథంగారి దగ్గరకు వెళ్దాం అనుకుం టూండగానే పిలిచాడు కృష్ణమూర్తి . . . "ఏం, శ్రీనివాసులూ! మొగళ్ళపాలెం నించి ఎప్పుడొచ్చావ్...ఈ బస్సు కేనా?... మొగలి రేకులు తెచ్చావా?... మా పెద్దమ్మాయి సరదా పడుతుం దోయ్!...'ఇవ్వాళ మామయ్య క్యాంపు నించి వస్తాడు, తెస్తాడు లేవే' అన్నాను"... 'కూరల సంచీ సైకిలుకు తగిలించుకొని, మొహంమీద జలపా తలాం ప్రవహిస్తూన్న చెమట తుడుచు కొంటూ, మూడణాల మొగలిపూల కోసం లేనిబాంధవ్యాన్ని నొక్కి చెప్తుతూ, నవ్వుతూ, ఆసగా నిల్చున్నాడు కృష్ణమూర్తి.

"నా దగ్గర డబ్బులేదు. తీసుకురా లేదోయ్!...ముందే చెప్పరాదూ?"

కృష్ణమూర్తి ముందే చెప్పడు. చెప్పితే డబ్బు ఇచ్చుకోవల్సి వస్తుందేమోనని!

"కరణానికి చెప్పలేకపోయావ్? బంట్రోతుగాళ్ళని వురమాయించే వాడు..."

"వాటి విషయం అనుకోలేదు ఇంట రెస్ట్ లేదు... సరే, బ్రదర్! ఒక అయిదు రూపాయలు కావాలి అర్జంటుగా... బియ్యం తీసుకెళ్ళాలి యింటికి..." కృష్ణమూర్తి ముఖంలో నవ్వు మాయ మైంది... "సారీ బ్రదర్! ఇవ్వాళ ఇరవైమూడో తారీఖు అని మరచి పోయావు కాబోలు! మనం అంతా ఒక బోటులోనే ప్రయాణం!" అంటూ సైకి లెక్కి రివ్వున మాయమయ్యాడు...

శ్రీనివాసరావు రామనాథంగారి యిల్లు చేరుకునేటప్పటికి ఆయన భోజ నానికి కూర్చున్నాడని తెలిసింది. వరం డాలో నిల్చున్నాడు శ్రీనివాసరావు. చెమటపోస్తూ చాలా చిరాగ్గావుంది... బస్సులో రద్దీ...ఇద్దరు లావుపాటి మనుష్యులమధ్య బస్సు కుదుపులకు బాగానలిగిపోయాడు ..తలనిండా, ఒంటి నిండా దుమ్ము...చెమటతో కలిసిన దుమ్ముస్పర్శ తుడుచుకోటానికి ప్రయ త్నించినప్పుడల్లా, అసహ్యంగా వుండేది. బస్సుదిగివెళ్ళగానే స్నానం చేసి, మంచంమీద వాలుదామనుకొన్నాడు

ప్రయాణంలో వున్నంతసేపూ...కాని ఆ యోగం పట్టలేదు...మెల్లగా నడినెత్తి కెక్కుతున్న సూర్యుడు రామనాథంగారి వరండాలో విజృంభిస్తూ, దేహాన్నీ, బట్టల్నీ, చివరికి ఉనికినే దుర్భరం చేస్తున్నాడు.

అసహ్యంనించే కాస్సేపటిలో నిర్లిప్తత పుట్టుకురావటం గమనించాడు శ్రీనివాసరావు. అప్రయత్నంగా ఎండిపోయిన పెదవులు నాలుకతో తడుపుకొంటూ...ఎదురుగుండాఉన్న యింటి కిటికీవైపు చూశాడు...కిటికీ తలుపు ఓరచేసుకొని రెండుకళ్లు తనవైపు కేంద్రీకృతమై ఉండటం తెలిసింది—ముఖం మీద చెమట తుడుచుకొని, జుత్తుకాస్త సవరించుకొని, ఠీవిగా నిల్చుందామనిపించి, చెయ్యి జేబురుమాలుకోసం పంట్లాం జేబులోకి వెళ్లింది తటాలున...కాని మళ్ళీ అక్కడే జేబులోనే ఆగిపోయింది... నిర్లిప్తంగా శ్రీనివాసరావు తనదృష్టి రోడ్డువైపు మళ్లించాడు... కుక్కలు రెండు పరస్పరం మూంచూచుకుంటూ వలయాకారంగా తిరుగుతున్నాయి.

శ్రీనివాసరావు పెద్ద విసుగు పుట్టుకొచ్చి అక్కడినుంచి వెళ్లిపోదామనుకున్నాడు...ఏం, పట్టిచేతుల్తో యింటికి వెళ్తేయేం? రాధ మొత్తుకోవటం, పిల్లల గోల...అంతకన్న ప్రమాదం ఏమీజరగబోదు కదా! వరాండా మెట్టొకటి దిగబోయాడు వెళ్ళిపోవాలని శ్రీనివాసరావు. కాని, రామనాథంగారు తలుపుతెరచి లోపలికి రమ్మని పిలిచారు...సరే, తప్పదు!

"ఏమిటోయ్, ఈమధ్య కనిపించనే లేదు!... మీ నాన్నగారు కులాసాయేనా?...ఇప్పుడాయన మీ అన్నయ్య దగ్గర కదూ ఉంటోంది? నెల్లూరా?"

శ్రీనివాసరావు చెవులు మూసుకోలేదు గాని, వినటంమాత్రం మానివేశాడు...

"...పాపం కదూ!" అని ఆగారు రామనాథంగారు.

"అవును" అని అంగీకరించాడు ఏమిటో తెలీకుండానే.

"నలుగురు పిల్లలోయ్...అకస్మాత్తుగా ఆమె పోయిందా. యిహ ఆ సంసారం గతేం కావాలి, ఆలోచించు, ఏమిటో యీ కష్టాలు!"

"అవును...పాపం" అన్నాడు ఆయన్ని ప్రతిధ్వనిస్తూ.

"ఈ వార్త విన్నప్పట్నించీ మా యింటిల్లిపాదీ విచారంలో మునిగిపోయామనుకో!"...బ్రేవు మని త్రేన్చారు రామనాథంగారు త్రేనుపు ఆపుకోవటం సాధ్యంకాదు......దానికి సందర్భ శుద్ధి తెలీదు...రామనాథంగారు అన్నవాహికను సరిచేసుకుంటూ ఆగిన అవకాశం పోగొట్టకూడదని శ్రీనివాసరావు సొంతవిషయానికి వచ్చేశాడు వెంటనే...



"ఏమండీ......నాకో పది రూపాయలు అర్జంటుగా కావాల్సి వొచ్చాను... గంట క్రితం క్యాంపునుంచి వచ్చాను, యింటో బియ్యం నిండుకున్నాయి. చేతిలో కానీ లేదు!"

"ఆఁ...పది రూపాయలు నెలాఖరులో నా దగ్గరమాత్రం ఎక్కడుంటాయోయ్!...మా ఆవిణ్ని అడుగుతానుండు..."

లోపలికివెళ్ళి అయిదురూపాయలు తెచ్చియిచ్చారు.

"చాలా థాంక్స్ సార్......జీతం రాగానే యిస్తాను...సెలవు."

* * *

స్నానంచేసి, భోజనం చెయ్యగానే కునుకు పట్టింది శ్రీనివాసరావుకు...... 'క్యారు'మని ఉయ్యాలలో చంటిది ఏడవటంతో మెలకువ వచ్చింది..."అబ్బ, పాడు గోల;...రాధా రాధా"...కేక వెయ్యాలన్న మామూలు ఉద్రేకం...... వచ్చికూడా, అంచుదాటని పాలపొంగులా చల్లారిపోయింది...కేకలు వెయ్యకుండా అలానేచూస్తున్నాడు...రాధవచ్చి పిల్లని తీసుకువెళ్ళింది...... రెండోవాడు.. ఏణ్ణర్థం వయస్సు...మూత్రంపోసి, మడుగు రెండు చేతుల్తో తట్టుతూ ఆనందిస్తున్నాడు...శ్రీనివాసరావు గోడవైపు తిరిగి పడుకున్నాడు...గోడ మీద డాగులు...అందులో రెండు చారలు.. నల్లి రక్తం తాలూకు..."అదుగో నల్లి పోతుంది వెళ్ళిపోతుంది...చంపాలి!" ...ఎడమచేతి బొటనవ్రేలితో...ఊఁ లోపలి ప్రేరేపణకు చెయ్యిమాత్రం కదల్లేదు...శ్రీనివాసరావు చూస్తూ ఉండిపోయాడు... 'నల్లి వెళ్ళిపోయింది! ఇహ కనపడదు!' ...పోనీ...ఏం మునిగిపోయినట్టు?

"ఏమండీ...కాఫీ......లేచిమొహం కడుక్కోండి!"

కాఫీత్రాగి మళ్ళీ మంచంమీద కూర్చుండేరా ధ...చంటిదాన్ని తెచ్చి ఒళ్ళోపెట్టింది..."ఇవాళటికి యింటోనే వుంటారు కదూ!"

"లేదు...అలా వెళ్ళి రావాలి."

రాధ అన్నందుకే బయలుదేరాడు... ఎక్కడికి?... యాంత్రికంగా కాళ్ళీడ్చు కుంటూ చెరువుకేసి నడుస్తున్నాడు...... రైలుగేటు దగ్గరకు వచ్చేప్పటికి రైలు వచ్చేసింది...గేటు మూశారు...నిలుచు న్నాడు. రైలుపెట్టెలోంచి వింతగా మను ష్యులు తనవైపే చూస్తున్నారు! వేగంగా పెట్టెలు ఒకదాని తర్వాత ఒకటి పను షల్లో వెళ్ళిపోతున్నాయి, టకా– టక్ టకా–టక్ శబ్దం చేసుకుంటూ.

గేటు తెరిచారు. టకా_టక్ టకా_టక్ చెవుల్లో మోగుతునే వుంది......తలు పులు మూసుకొని కిటికీసందుల్లోంచి తొంగిచూస్తూ కూచుంటారు .ఎలుకల్లా.. బొరియల్లో పందికొక్కుల్లా...టకా–టక్, టకా–టక్ వెళ్ళే రైలుపెట్టెల్లో...పాకు మనుషులు!...ఆ రైలుకోసం తనెందుకు ఆగాడు. ఆగకపోతే.. తన దేహం రైలుక్రింద పడుతుంది...అప్పుడు తప్ప కుండా రైలు ఆగిపోతుంది!... బోను ల్లోని ఎలకలూ, బొరియల్లోని పంది కొక్కులూ బిలబిలా వచ్చి గుంపుగాచేరి, గలగలాశబ్దం చేస్తాయి...

శ్రీనివాసరావు చెరువుగట్టుమీద కూర్చుని నీళ్ళవైపు చూశాడు...తనకు నీటి ప్రమాదం లేకుండా చెయ్యాలని చిన్నప్పుడు తండ్రి పట్టుపట్టి ఈత నేర్పించాడు...ఎంత జాగ్రత్త!... ప్రాణాలు ఎక్కడ తప్పించుకొని పారి పోతాయేమోనని భయం...ప్రతిదీ యిలాగే...తండ్రి చెప్పినవన్నీ తు.చ. తప్పకుండా ఆచరించాడు...ఇంకా ఆచ రిస్తున్నాడు...ఫలానావాళ్ళతో స్నేహం వద్దంటే మానుకున్నాడు; ఫలానా పుస్త కాలు మంచివి, చదవమంటే చదివాడు; తప్పకుండా పరీక్షలు పాసవమంటే అయ్యాడు; బి.ఏ. లో క్లాసు రావాలంటే, క్లాసు తెచ్చుకున్నాడు; ఫలానా అమ్మా యినిచేసుకో, చాలామంచి సంబంధం అంటే చేసుకున్నాడు. పిల్లల్ని కన్నాడు...తండ్రీ, పెద్దలూ మిగతా వాళ్లూ, అందరూ ఏది మంచిది అంటారో అంతా అలానే చేశాడు...యీ కో–ఆప రేటివ్ ఇన్‌స్పెక్టరు గిరీ—సర్కారు ఉద్యోగం—ఆలస్యం చెయ్యకు, వెంటనే ప్రవేశించు, మంచిది అంటే డిగ్రీ పుచ్చుకున్న ఏడాదే, అందరి సమ్మతి ప్రకారం ప్రవేశించాడు...పై అధికారులు చెప్పింది చేస్తున్నాడు; ఎప్పుడూ తిరగ బడలేదు. పనిచెయ్యకుండా తప్పించు కోలేదు. అబద్ధాలు చెప్పలేదు; లంచాలు తీసుకోలేదు ఇక తను చెయ్యవలసిందే మిటో ఎవరూ చెప్పలేదు...ఇప్పుడు చెప్పటంలేదు. రాధమాత్రం దినకార్య క్రమం చెపుతూ వుంటుంది. "ఏమండీ, మొహం కడుక్కోండి...కాఫీతాగండి ...స్నానం చెయ్యండి ... భోజనం చెయ్యండి...బజారుకు వెళ్ళండి...ఇక పడుకోండి, దీపం ఆరిపివేస్తాను..." ఇదీ జీవితం అంటే...

మరి దీన్లో ఏమి విశేషంవుందనీ... కాకపోతే, తనలాంటివాళ్లు యీ జీవితం నుంచి ఏం విశేషాన్ని ఎట్లా సృష్టించ గలరనీ... ఊరికే మభ్య పెట్టటం చిన్న ప్పట్నించీ!..."ఇదిగో అబద్ధం చెప్ప బోక...అందరికీ మంచిగావుండు... తల్లిదండ్రుల్ని గౌరవించు...అణకువ, విధేయత నేర్చుకో..." గౌతమబుద్ధు నిలా కావచ్చుననే ఆశ చూపెట్టడం... నీతి, నీతి...మరి యీనీతికీ ఆదర్శాలకి బద్ధుడైన తన జీవితం యిట్లా రైలు పెట్టెలా, ఋంద గుంటలా తయార వ్వటం ఎందు వేత?...తను యింకేం చెయ్యాలి?...చెయ్యాల్సినదేమీలేనప్పుడు జీవితంనుంచి నిష్క్రమిస్తే ఏమి? చావంటే పూర్వమేదో భయం వుండేది... యిప్పుడాభయమేమీ లేదు...తనకు నీటివల్ల చావులేదు...రైలుక్రింద పడు కుంటే...గమ్మత్తుగా వుంటుంది...జీవి తానికి అటువేపు ఏముందో చూడవచ్చు.

శ్రీనివాసరావు తిరిగి వస్తూంటే గోపాలం కనిపించాడు...గోపాలం హైస్కూల్లో టీచరు... "సినిమాకు వస్తారా, ఇన్‌స్పెక్టరుగారు!..." అర్థం లేని వ్యంగ్య ధోరణి!

"డబ్బు లేదోయ్"

"నేను తీసుకువెళ్తాను రావయ్యా... చాలా బాగుందంటున్నారూ!" చెయ్యి పుచ్చుకుని లాక్కువెళ్లాడు గోపాలం... పంద్రెండణాల టిక్కెట్టు కొన్నాడు.

జానపద చిత్రం...అరగంట తర్వాత కూర్చోబుద్ధెయ్యలేదు శ్రీనివాస రావుకు..."గోపాలం! సినిమాలో యింటరెస్టు పుట్టటంలేదు...నేను వెళ్తా నోయ్!"

"అదేమిటి! ఎందుకని? తలనొప్పా?"

"లేదు...ఊరికె నే."

"ఏమిటోయ్! కారణమేమీ లేకుం డానే! ఇదుగో యిహ హీరోయిన్ డాన్సు వుంటుంది...కాస్తవుండు, ఎంజాయ్‌చేస్తావు... ఇంటరెస్టు దానంత టదే పుట్టుతుంది..."ఆ ఎంజాయ్‌మెంటు తనతో పంచుకుంటేనేగాని తృప్తిలేద న్నట్టు ప్రాధేయపడ్డాడు గోపాలం.

హీరోయిన్ డాన్సు ప్రారంభమైంది. సగం తర్వాత మళ్ళీ శ్రీనివాసరావు అన్నాడు..."వెళ్తానోయ్!"

"పంద్రెండణాలు పెట్టాను బాబు. సగం విలువైన వస్తుంది ఇంటర్వెల్ దాక వుండవోయి!"

నిజమే...డబ్బు దండగ పోవటం దేనికి? ఇచ్చిన డబ్బుకోసమైన చివరి దాకా కూచోవలసిందే...అదే అందరూ చేసేపని...లేకపోతే, తనేం ధనవం తుడు, డబ్బు నిర్లక్ష్యం చెయ్యటానికి? గోపాలం వదలిపెట్టడు...డబ్బు వృథా కానివ్వడు...తగిన కారణం లేకుండా వెళ్ళటానికి వీల్లేదు...

"గోపాలం! మా చంటిదానికి వంట్లో వెచ్చగావుందని చెప్పింది మా ఆవిడ...

నా కోసం కనిపెట్టుకుని వుంటారేమో యింటిదగ్గర...అబద్ధంచెప్పాడు.

"నిజంగానే?...యీ సంగతి ముందే ఎందుకు చెప్పలేదోయ్?...సినిమా ప్రొప్రైటర్‌కి ఉత్తపుణ్యానికి చెల్లించావు ...మంచివాడవే?" విసుక్కున్నాడు

"మరేమనుకోకు...వెళ్తాను"

శ్రీనివాసరావు యిల్లుచేరేటప్పటికి పెద్దవానికి అన్నం పెట్టుతూ వుంది శ్రీమతి...మిగతా యిద్దరూ నిద్రపో యారు...కండువా చిలక్కొయ్యకి వేసి, చాప తీసుకొని డాబామీదికి వెళ్ళాడు శ్రీనివాసరావు. చాపమీద వెల్లకిలా పడుకున్న తర్వాత నక్షత్రాలకేసి చూస్తూ ప్రశ్నించుకున్నాడు..."రైలు పట్టాలమీద పడుకునే దెప్పుడు?" "ఎప్పుడో ఒకసారి, వెధవది! దానికీ కొంత ప్రయత్నంకావాలి" అని జవాబు వచ్చింది.

శ్రీమతి మెట్లెక్కి వచ్చింది... దగ్గరగా వచ్చి "ఏమండీ వడ్డించమంటారా?" అన్నది. మొగలిపువ్వు పరిమళం తెర శ్రీనివాసరావును ఉక్కిరిబిక్కిరి చేసింది.

"ఎక్కడివి మొగలిరేకులు?"

"పక్కింటావిడ ఇచ్చింది...ఏం, వడ్డించనా, లేక ఇంకా ఆలస్యం వుందా! లేవండి! తర్వాత వచ్చి పడుకుందురు గాని?"

"ఊఁ...కానీయి." రాధ క్రిందికి వెళ్ళిపోయి ంది.

శ్రీనివాసరావుకు జ్ఞాపకంవచ్చింది... నక్షత్రాలు, ఆకాశం, మొగలిరేకుల వాసనా, గాజుల గలగలా. చిక్కని చీకటి, వెచ్చని కౌగిలి...సుజాత, మొగళ్ళపాలెం ప్రైమరీస్కూలు టీచరు ...రైలు ప్రమాదంలో చనిపోయింది...

ఆదర్శానికి, నీతికి బద్ధుడుగా తనెక్కడున్నాడు?...రెండేళ్ళ క్రితం సుజాతతో ప్రణయం. అది అవినీతి, రాధకు అన్యాయం...మెలుకువతో కాపాడుకోవలసిన రహస్యం...క్యాంపుకు వెళ్ళిన ఒక్కొక్కసారి ఒక మహత్తరమైన అనుభవం...సుజాత తనవాణ్ణి చేసుకుంది ... భయపడ్డాడు బాధపడ్డాడు...కాని, సుజాతను చూడగానే భయమూ, బాధా, పశ్చాత్తాపము, పాపమూ, అంతర్ధానమయ్యేవి!...ఎంత మంచిది సుజాత,...ఆమె కోరిన ప్రతిఫలం ఏమీలేదు...ఒకసారి, బాగుంటదనుకొని, పదిహేనురూపాయలు పెట్టి షిఫాన్ చీర కానుక తీసుకెళ్తే...వద్దన్నది...తర్వాత నెల తిరక్కుండానే, సుజాత లేదు!

"ఏమండోయ్, మిమ్మల్నే?... ఎంతకూ రారేమిటి?"

ప్రత్యక్షానుభవంగా ఉన్నప్పుడు భయమూ బాధా కలిగించినా...దాని మూలంగానే...ఆ రహస్య వల్లే... మొగలిపువ్వు వాసన, నక్షత్రాలు, ఆకాశం. .వీనితోపాటు తనూ వుంటాడు!

---